అందరి దృష్టి రిజల్ట్‌పైనే..



- మరి కొన్ని గంటల్లో వీడనున్న ఉత్కంఠ
- 'మల్కాజిగిరి' తమదే అంటూ అభ్యర్థుల ధీమా
- పోలైన ఓట్లపై ఎవరి లెక్కలు వారివే..

ఉప్పల్/ఎల్‌బీనగర్ : మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ మరికొన్ని గంటల్లో వీడనుంది. గెలుపుపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తామే గెలుస్తామంటూ పైకి గంభీరంగా కనిపిస్తున్నా లోలోన మాత్రం నరాలు తెగే ఉత్కంఠతో ఉన్నారు. ఈ గెలుపు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి ముగ్గురికీ ప్రతిష్టాత్మకమే. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవగానే అంతకు ముందు బీఆర్ఎస్‌లో మంత్రిగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి సతీసమేతంగా కాంగ్రెస్ పార్టీలో చేరి మల్కాజిగిరి టికెట్‌ను తన భార్య సునీత మహేందర్‌రెడ్డికి ఇప్పించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన రాగిడి లక్ష్మారెడ్డి సైతం టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనవంతుగా కృషిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకున్నాడు. ప్రస్తుతం బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయం అంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడుకు ఏడు నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఉండటంతో తామే భారీ మెజార్టీతో గెలుస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పాటు బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నారు. ఇక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా హుజురాబాద్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఈటల రాజేందర్ మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ హవా ఉండటంతో తన గెలుపు సునాయసమే అని అంటున్నారు. ఈటల గెలుస్తారని బీజేపీ శ్రేణులు సైతం సంతోషంలో ఉన్నారు. ఉప్పల్ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పట్నం సునీతమహేందర్ రెడ్డిని గెలిపించాలని, ఆమెకు ఓటు వేస్తే నాకు వేసినట్లే అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారంలో ప్రకటించడంతో తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. ఏదిఏమైనా మరికొన్ని గంటల్లో ఉత్కంఠకు తెరపడనుంది. 2019లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో వివిధ పార్టీలకు ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో వచ్చిన ఓట్లు ఇలా ఉన్నాయి.

- కాంగ్రెస్ అభ్యర్థి ఎనుముల రేవంత్‌రెడ్డికి 85,385
- టీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డికి 77,501
- బీజేపీ అభ్యర్థి రామ్‌చందర్‌రావుకు 46,143

2023 ఉప్పల్ అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు వచ్చిన ఓట్లు..

- మొత్తం పోలైన ఓట్లు 2,73,226
- బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు 47,332
- కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి 83,397
- బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి 1,32,927.

2024 పార్లమెంట్ ఎన్నికల్లో..

మొత్తం ఓట్లు	5,40,052
పోలైన ఓటు	2,61,634
పురుషులు	1,35,338,
మహిళలు	1,26,285,
ఇతరులు	11.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. తరుచూ కరెంట్ సరఫరాలో అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేలా చూడాలని ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను కోరారు. దీంతో స్పందిస్తూ విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అనంతరం పలు సమస్యలపై కాలనీవాసులు కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటాచలం, విక్రం, భ్రమరాంబ, నాయకులు ముత్యాలు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: గత దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల్లో భాగంగా వనస్థలిపురం ఏరియాసుపత్రిలో సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న చోట స్కై, ఫ్లై ఓవర్లు నిర్మించామని, నాగోల్‌లో ఎస్‌టీపీ ప్లాంట్ పనులు జరుగుతున్నాయని, అలాగే పలు ప్రాంతాల్లో ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టామని పలు పనులు చివరి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మూడు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ కృష్ణ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, సుమన్ గౌడ్, మాధవరం నర్సింహారావు, మధుగౌడ్, సామ బుచ్చిరెడ్డి, శివశంకర్, సత్యంచారి, ఖైసర్, సంజయ్‌కుమార్, రాంమోహన్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సహారా స్టేట్స్ సొసైటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



సహారాక్లబ్ హౌజ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న కాలనీ నూతన కమిటీ సభ్యులు

మన్సూరాబాద్: ఉత్కంఠభరితంగా సాగిన సహారా స్టేట్స్ మెయింటనెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికల్లో వెంకటాద్రి ప్యానల్ విజయం సాధించింది. సోమవారం ఎన్నికల అధికారులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి సహారాస్టేట్స్‌కాలనీలోని క్లబ్‌హౌజ్‌లో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా సయ్యద్ జానీ, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, కోశాధికారిగా శేఖరయ్య, జాయింట్ సెక్రటరీలుగా భీమ్లానాయక్, మంజులతో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గెలుపోటములు సహజమని, గత కమిటీ సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, మాజీ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, సతీశ్, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక పద్యనాటకం



శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకాన్ని ప్రదర్శిస్తున్న నటులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఇన్‌కం ట్యాక్స్ కాలనీలో శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నటీనటులు తమ హావాభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఇందులో దుర్యోధనుడిగా కొట్టె వెంకటాచార్యులు, శ్రీకృష్ణుడిగా సూలపాణి, గాంధారిగా సావిత్రీతో పాటు దర్శకుడు రాజనాల, ఇతర నటులు అద్భుత నటనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి పాత్రధారి సూలపాణి మాట్లాడుతూ తాను సర్జన్ డాక్టర్ అయివుండి నాటక కళారంగం అంతరించిపోకుండ ఉండాలనే ఉద్దేశంతోనే తెలుగు రాష్ట్రాల్లో పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్నామని తెలిపారు. రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధా, మునిపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాటకు పట్టాభిషేకం



బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

లింగోజిగూడ: ఎస్పీ బాలు తన గళంతో పాటకు పట్టాభిషేకం చేసిన మహా గాయకుడని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం 78వ జయంతి సందర్భంగా ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నాగోలు కో ఆపరేటివ్ కాలనీలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సుధాకర్, మురళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు



హయత్‌నగర్ స్వాతిరెసిడెన్సీ కాలనీలో పగలే వెలుగుతున్న వీధిదీపాలు

మన్సూరాబాద్: హయత్‌నగర్ స్వాతి గార్డెన్స్ వద్ద గత 10 రోజులుగా వీధిదీపాలు పగలే వెలుగుతున్నాయి. ఈ విషయమై కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ స్ట్రీట్‌లైట్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు స్పందించకపోవడంతో ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇరు విభాగాల అధికారులు కూడా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముగిసిన బాల వికాస్ సమ్మర్ క్యాంప్



బాలవికాస్ సమ్మర్ క్యాంప్‌లో దేశ భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

చైతన్యపురి: గడ్డిఅన్నారం శారదానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కుటుంబ ప్రభోద్ విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలవికాస్ సమ్మర్ క్యాంప్ సోమవారం ముగిసింది. అంతరించిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తితో పాటు మాతృభాష ఆవశ్యకతను పిల్లల్లో అవగాహన పెంచేందుకు 20 రోజుల పాటు క్యాంపు నిర్వహించామని నిర్వాహకులు వినోద్‌కుమార్, లక్ష్మీనారాయణ తెలిపారు. పిల్లలకు దేశభక్తి, దైవ భక్తి, భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, పాటలు నేర్పించామని తెలిపారు. 70 మంది చిన్నారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రాజేందర్ ప్రసాద్, అరుణ జ్యోతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం

రామంతాపూర్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు ఉప్పల్ నియోజకర్గ సీనియర్ బీఆర్ఎస్ నేత రామంతాపూర్‌కు చెందిన తిప్పని సంపత్‌కుమార్ జన్మదిన వేడుకలకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి సంపత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమకారుడైన సంపత్ పార్టీ అభివృద్ధి కోసం అంకిత భావంతో పని చేసిన నేత అని కొనియాడారు. పార్టీ పదవుల్లో మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకే ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మహ్మద్ ముస్తాక్, వెంకటేష్‌చారి, రవి, యాదగిరిరెడ్డి, లక్ష్మమ్మ, మురళి, మల్లేశం, సైదులు, మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు మోసాలతో బీకేర్ ఫుల్

కుషాయిగూడ: బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం ఓ అధికారిని ఖంగు తినిపించింది. ఆయన పాన్ కార్డును జతచేసి మరో వ్యక్తికి క్రెడిట్ కార్డు మంజూరీ చేసి సదరు అధికారిని డిఫాల్టర్‌గా మార్చేసి అవమానపరిచారు. ఆయనకు అత్యవసరమై లోన్ కోసం బ్యాంకుకు వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కాప్రా, శాంతివిహార్ కాలనీ, గ్రీన్‌పార్కు ఎన్‌క్లేవ్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ఎంఎస్ రాజు(74) 2021లో డిఫెన్స్ కాలనీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లోన్ కోసం సంప్రదించి దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు అధికారులు కల్నల్ లోన్ దరఖాస్తును తిరస్కరించారు. తన దరఖాస్తును ఎందుకు తిరస్కరించారంటూ కల్నల్ బ్యాంకు అధికారులను ప్రశ్నించగా మీకు సంబంధించి ఎస్‌బీఐ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకుల క్రెడిట్ కార్డులకు సంబంధించిన బిల్ రూ.46,757 చెల్లించకుండా డిఫాల్టర్‌గా ఉండటం కారణంగా లోన్ దరఖాస్తును తిరస్కరించినట్లు తెలిపారు. దీంతో కల్నల్ ఖంగుతిన్నాడు. అయితే ఆయన ఇప్పటి వరకు క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఎలాంటి క్రెడిట్ కార్డులు తీసుకోలేదు. తనకు జరిగిన మోసంపై ఆయా బ్యాంకులకు మెయిల్‌లో ఫిర్యాదు చేశారు. పలు మార్లు మెయిల్ చేసినా బ్యాంకుల నుంచి ఎలాంటి రిప్లై రాకపోవడంతో ఆర్‌బీఐని ఆశ్రయించాడు. తనకు జరిగిన మోసంపై ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆర్‌బీఐ అధికారులు సదరు క్రెడిట్ కార్డులు కె.ఎస్.ఎన్. రాజుకు సంబంధించినవిగా తేల్చింది. బ్యాంకు అధికారులు తమవల్ల జరిగిన తప్పిదానికి క్షమాపణలు కోరి కల్నల్ సిబిల్ స్కోర్‌ను సవరించి లోన్ క్లియర్ చేశారు. ఇది ఇలా ఉండగా కల్నల్ తనకు జరిగిన అన్యాయంపై కోర్టును ఆశ్రయించి తనను డిఫాల్టర్ అంటూ బ్యాంకు అధికారులు తన పరువుకు భంగం కలిగించారని మల్కాజిగిరి కోర్టును ఆశ్రయించాడు. విచారించిన మేజిస్ట్రేట్ కల్నల్‌కు జరిగిన పరువు నష్టంపై కేసు నమోదు చేయాలంటూ కుషాయిగూడ పోలీసులను ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు 2023లో కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి సంబంధిత బ్యాంకులకు నోటీసులు జారీ చేశారు. పోలీసుల నోటీసులపై బ్యాంకు అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు కేసు విచారణను ఇంతటితో నిలిపివేయాలంటూ పోలీసులను ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. దీంతో పోలీసులు చార్జిషీట్ వేయకుండా కేసు విచారణను నిలిపివేశారు. ఇలాంటి ఘటనలు తరచూ ఏదో ఓ చోట చేసుకుంటున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవశ్యకత ఉంది. అందుకు కల్నల్‌కు జరిగిన మోసమే ఓ ఉదాహరణ.

చైన్ స్నాచర్ల అరెస్ట్

లింగోజిగూడ: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులతో పాటు సహకరించిన మరో యువకుడిని నాగోలు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో నివాసం ఉండే గడ్డం కౌసల్య ఈ నెల 1వ తేదీన ఉదయం 7 గంటల సమయంలో ఇంటి ముందు చెట్టుకు పూజలు చేస్తున్నది. ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 5తులాల బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. కౌసల్య వెంటనే నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. నల్గొండకు చెందిన మునగాల శివారెడ్డి ఎల్‌బీనగర్ ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనిపై గతంలోనూ ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. నల్గొండ కనగల్ మండలం బాబాసాహెబ్ గూడంలో ఉండే సుంకిరెడ్డి శశిధర్ రెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు గతంలో మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసులో నిందితుడిగా ఉన్నాడు. వీరిద్దరు గౌరెల్లి ఎక్స్ రోడ్డులో అనుమానాస్పదంగా బైక్‌పై తిరుగుతుండడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో దర్యాప్తు చేయడంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరితో పాటు వారికి సహకరించిన నల్గొండ టౌన్‌లోని ఎల్లమ్మగుడి సమీపంలో నివాసం ఉండే దేవులపల్లి సాయికుమార్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 తులాల బంగారు గొలుసు, మూడు మొబైల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

జీవన నాణ్యతపై ప్రభావం చూపే నొప్పులు..

సాక్షి, సిటీబ్యూరో: తీవ్రమైన నొప్పులు వంటి శారీరక సమస్యలు జీవన నాణ్యతపై ప్రభావం చూపుతాయని భారత క్రికెటర్ విరాట్ కోహ్లీ చెప్పారు. అమెరికన్ నొప్పి నివారణ మందుల బ్రాండ్ టిఐడిఎల్‌కు ప్రచారకర్తగా నియమితులైన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన క్రీడాకారులకు వచ్చే శారీరక సమస్యలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో టిఐడిఎల్ సిఒఒ ప్రశాంత్ రాజ్ పాల్గొని మాట్లాడుతూ దేశీయ బ్రాండ్ బైద్యనాథ్, విరాట్ కోహ్లీలతో తమ ఒప్పందం ద్వారా స్థానికులకు చేరువ అవుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాట మొదలై నేటికి 30 ఏళ్లు పూర్తి



సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను సన్మానిస్తూ..

ఉప్పల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కాంట్రాక్టు ఔట్ సోర్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ తన పాట మొదలై నేటికి 30 సంవత్సరాలు పూర్తయ్యిందని, ఆనాడు ఒసెయ్ రాములమ్మ చిత్రంలో రాసిన పాట రామసక్కని తల్లీ రాములమ్మో.. అంటూ రాసిన పాటను గుర్తు చేసుకున్నారు. ఆనాడు తెలంగాణ యాస భాషను కేవలం కమిడీయన్లు, విలన్లు మాత్రమే మాట్లాడేవారని, నేడు సినిమా హీరో హీరోయిన్లు కూడా తెలంగాణ యాసలో మాట్లాడే విధంగా ఎదిగినందుకు సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు రాజమౌళి, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బేకరీలో అగ్ని ప్రమాదం

- రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఆస్తినష్టం
- మంటలను అదుపులోకి తెచ్చిన మలక్‌పేట ఫైర్ సిబ్బంది



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బేకరీలో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. అయితే మలక్‌పేట ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనూ ప్రమాదం తప్పింది. మలక్‌పేట ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి బీఎం కృష్ణమూర్తి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ అహ్మద్ మూసారంబాగ్ చౌరస్తాలోని మహ్మదీయ మసీద్ కాంప్లెక్‌లో క్యాపిటల్ హోటల్ ఎదురుగా రెడ్ రోజ్ బేకరీ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి బేకరీకి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 4 గంటలకు బేకరీ నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100 సమాచారం అందించారు. వారు మలక్‌పేట ఫైర్ సిబ్బంది, పోలీసులను అప్రమత్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, గౌలిగూడ, సాలర్‌జంగ్ మ్యూజియం, మలక్‌పేట ఫైర్ స్టేషన్లకు చెందిన మూడు ఫైర్ ఇంజన్లతో సుమారు 5 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. బేకరీకి ఇరువైపులా కార్టెన్స్, టైర్ల షాపులు ఉన్నాయి. ఈ ఘటనతో మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వచ్చే జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం కాగా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. బేకరీలో దాదాపు రూ. 4 నుంచి 5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ అగ్నిప్రమాదానికి కారణమై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఆ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



జేసీబీతో కాలిపోయిన సామగ్రిని తొలగిస్తున్న సిబ్బంది

రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాట 31, వంకాయ 23, బెండ 38, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 125, క్యారెట్ 40, దొండ 13–18, చిక్కుడు 75, గోకర 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 55, ఆలు 31, దోస 23, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 27, చామగడ్డ 40.

గమనిక: ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

ముగిసిన దశాబ్ది ఉత్సవాలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి

సైదాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలను ఐఎస్‌సదన్ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం డివిజన్ పరిధిలోని జీఎస్ఆర్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రాజ్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మాధవరం నర్సింహారావు

ఎల్‌బీనగర్: మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్‌లోని సేఫ్ చారిటబుల్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలోని విద్యార్థులకు బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా నాయకుడు మాధవరం నర్సింహారావు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాశం శ్రీధర్, కావేటి రమేశ్, నవీన్, ప్రశాంత్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



యోగా శిక్షణ కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరమని, యోగా శిక్షణా కేంద్రాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఆచార్య జయశంకర్ పార్కులో ఏర్పాటు చేసిన నిరంతర ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సుధాకర్‌రెడ్డి, కిరణ్, గణేశ్, సంస్థాన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్.యాదగిరి, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

ముగింపు వేడుకల్లో మాజీ హోంమంత్రి



జాతీయ జెండా ఎగురవేసిన మాజీ హోంమంత్రి మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: అజంపురాలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు నిర్వహించారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ హాజరై నాయకులతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు అజం అలీ, అజిత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, షౌకత్ అలీ, సల్మాన్‌ఖాన్, సుమన్ పాల్గొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ఉప్పల్: ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లో సిగ్మా హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట(మూడు ముక్కలాట) ఆడుతున్న ఏడుగురు రియల్ వ్యాపారులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. ఆదివారం రాత్రి సిగ్మా హోటల్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు స్థావరంపై దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30,770 నగదు, రెండు సెట్ల కార్డ్స్, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.